క్లుప్తంగా

రోడ్ల అభివృద్ధికి కృషి

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బుధవారం తెలిపారు. జగ్గయ్యపేట–షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు–కొనకంచి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.7.50కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. త్వరలోనే ఈ రోడ్ల పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనేక నష్టాలు



మక్కపేట(వత్సవాయి): ప్లాస్టిక్ వినియోగంతో అనేక దుష్ఫలితాలు ఉన్నందున ప్లాస్టిక్ వినియోగాన్ని అందరూ తగ్గించుకోవాలని మక్కపేట జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ వెంకటేశ్వరరావు సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సామాజిక విజ్ఞాన కళాశాల గుంటూరు లాంఫాం విద్యార్థులు బుధవారం పాఠశాలలో జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన హెచ్‌ఎం వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పెరిగితే పర్యావరణం దెబ్బతింటుందన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌టీ కళాశాల ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం నందిగామ పట్టణానికి చెందిన ఎస్‌కెడీపీ ప్రసాదరావు, రాజకుమారి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ సూపరింటెండెంట్ ఎల్ లక్ష్మణ్ చేతుల మీదుగా అందజేశారు. దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

మక్కపేట(వత్సవాయి): వైద్యం కోసం హాస్పిటల్‌కు వచ్చిన వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు భీమవరం గ్రామానికి చెందిన ఎస్ వెంకటేశ్వర్లు(70), లక్ష్మీ దంపతులు అనారోగ్యంగా ఉండటంతో రెండు రోజులు క్రితం మక్కపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వచ్చారు. అక్కడే ఉండి చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వెంకటేశ్వర్లు హాస్పటల్ నుంచి తనభార్యకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. భార్య వెంకటేశ్వర్లు కోసం ఎంత వెతికినా ఆచూకీ తెలియరాలేదు. బుధవారం సాయంత్రం ఎస్సీ కాలనీ వద్ద రహదారిపై వెంకటేశ్వర్లు పడి ఉండడాన్ని గమనించిన యువకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలానికి వెళ్లి చూడగా అప్పటికే వెంకటేశ్వర్లు మృతిచెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివసాయి క్షేత్రంలో మాలాధారణలు



కంచికచర్ల: స్థానిక శివసాయి క్షేత్రం అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప భక్తులకు మాలాధారణ చేశారు. భారీసంఖ్యలో భక్తులు మాలధారణ చేశారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన అయ్యప్పలు కేరళ తాంత్రిక శ్రేష్ఠ బ్రహ్మ కె.పద్మనాభన్ నంబూద్రి పప్పాస్వామి చేతుల మీదుగా మాలధారణ చేశారు. ఈ సందర్భంగా పప్పాస్వామి మాట్లాడుతూ శ్రీశివసాయిక్షేత్రంలో అయ్యప్పలకు మాలాధారణ, ఇరుముడుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాలధారులు 41రోజులపాటు నిష్ఠగా ఉండి అనంతరం ఇరుముడులు కట్టుకుని శబరి వెళ్లాలని సూచించారు.

ఉద్యోగిపై టీడీపీ నాయకుడి దురుసు ప్రవర్తన

కొణకంచి(పెనుగంచిప్రోలు): మండలంలోని కొణకంచి గ్రామ పంచాయతీ కార్యదర్శి మహ్మద్‌అలీ, సిబ్బందిపై గ్రామ టీడీపీ అధ్యక్షుడు సామినేని రంగారావు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్యాలయ సిబ్బంది కథనం మేరకు ..సామినేని రంగారావు 2023 నుంచి పంచాయతీకి బకాయి ఉన్న పన్నులను చెల్లించాలంటూ ఇటీవల సిబ్బంది ఆయన ఇంటికి వెళ్లి తెలియజేశారు. ఈక్రమంలో రంగారావు ఈనెల ఆరోతేదీన మద్యం సేవించి పంచాయతీ కార్యాలయానికి వెళ్లి తాను పన్నులు చెల్లించానంటూ పాత రశీదులు చూపిస్తూ, తాను పంచాయతీకి ఎటువంటి బకాయి లేనని పేర్కొన్నారు. అయినా తనను పన్నులు చెల్లించమంటున్నారంటూ బూతులు లంకించుకున్నారు. కార్యాలయంలో ఉన్న కుర్చీని తన్ని హంగామా సృష్టించడంతో సిబ్బంది హడలెత్తిపోయారు. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సమాచారం.

సీజేఐపై దాడిని ఖండిస్తూ ర్యాలీ

కంచికచర్ల: భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పై కోర్టులో దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ డిమాండ్ చేశారు. సీజేఐపై జరిగిన దాడిని ఖండిస్తూ కంచికచర్లలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సాక్షిగా ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేయడమంటే భారత ప్రజాస్వామ్యంపై దాడి చేయటమేనన్నారు. దేశంలో మత విద్వేశాలను రెచ్చగొడుతూ దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని అభివర్ణించారు. సనాతన ధర్మం పేరుతో దాడులకు తెగబడుతున్నారని శిక్షించకపోవడం ప్రజాస్వామ్యానికి తీరని ముప్పు అన్నారు. ఈ దాడిని అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. సీజేఐ దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బెజ్జం భూషణం, ఎస్ఎఫ్ఐ నాయకులు గోపీనాయక్, పంచాయతీ కార్మికులు సుధాకర్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో నిరసన ర్యాలీ చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: సీజేఐ గవాయిపై మతతత్వవాదులు దాడికి యత్నించడం బాధాకరమని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. సీజేఐపై న్యాయవాది దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ మండలంలోని జుజ్జూరులో ప్రజాసంఘాల నాయకులు బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. నిందితుడిని శిక్షించాలంటూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సంఘాల నాయకులు కోట కళ్యాణ్, చాట్ల రవి, నాగభూషణం, నరసయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



జుజ్జూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కల్తీ మద్యం విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి

వేమా సురేష్‌బాబు



కంచికచర్ల: కంచికచర్ల, నందిగామ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో కల్తీ మద్యం అమ్మకాలు సాగించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్ష్యుడు వేమా సురేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కంచికచర్ల, నందిగామ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని పలు మద్యం దుకాణాల నుంచి కల్తీ మద్యం నేరుగా బెల్టుషాపులకు తరలి వెళ్లిందని ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ సిబ్బంది వారి బినామీల పేరుతో ఓ మద్యం దుకాణం నిర్వహిస్తున్న విషయం రెండు మండలాల్లోని ప్రజలందరికీ తెలుసన్నారు. మద్యం షాపుల సిండికేట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి అధికారపార్టీకి చెందిన చోటా నాయకుడు కాదా? అని ప్రశ్నించారు. ఆ సిండికేట్ సూపర్‌వైజర్ ఇబ్రహీంపట్నంలోని నకిలీ మద్యం గోడౌన్ నుంచి కంచికచర్లలోని మూడు మద్యం షాపులకు నకిలీ మద్యం సరఫరా చేశారని ఆరోపించారు. కంచికచర్ల, కీసర, జుజ్జూరు గ్రామాల్లోని మూడు మద్యం దుకాణాల నుంచి నకిలీ మద్యంను ఆయా గ్రామాల్లోని గొలుసు దుకాణాలకు సరఫరా చేసి ప్రజారోగ్యానికి తీరని అన్యాయం చేయడమే కాకుండా లక్షలాది రూపాయలను దోచుకున్నారని విమర్శించారు. కల్తీ మద్యం వ్యాపారంలో ఏ 1గా ఉన్న జనార్దన్ కంచికచర్లలోని ఓ మద్యం షాపులో వాటాదారుడుగా ఉన్న మాట వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. ఇటీవల కంచికచర్ల మండలంలోని గనిఆత్కూరులోని ఓ బెల్టుషాపులో ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం విక్రయాలను అడ్డుకున్న ఎక్సైజ్ అధికారులను సిండికేట్ వ్యాపారి ఫూట్‌గా మద్యం సేవించి అర్ధరాత్రి వేళ వారిని దూషించిన వైనం అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి కంచికచర్ల, వీరులపాడు, నందిగామ మండలాల్లో కల్తీ మద్యం అమ్మకాలపై విచారణ జరిపి సంబంధిత షాపుల లైసెన్స్‌లను రద్దు చేయడంతోపాటు నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఈ కల్తీ మద్యం విక్రయాలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

నందిగామరూరల్: రైతులు పంటల్లో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ రవికిషోర్ సూచించారు. కేవీకే, హైదరాబాద్‌కు చెందిన జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ సంస్థ శాస్త్రవేత్తలు బుధవారం మండలంలోని పల్లగిరి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ పరిశోధనా నివారణ సంస్థ ద్వారా ఎస్సీ రైతులకు ఉద్యాన విభాగంలో మొక్కలు, మహిళలకు కుట్టుమిషన్లు కోళ్లు అందజేసి వారి ఆదాయాన్ని పెంచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. వారిలో నైపుణ్యం పెంపుదల కోసం కోళ్ల పెంపకం, టైలరింగ్, నర్సరీ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పంటల సాగులో అధునాతన పద్ధతులతో పాటు యాజమాన్య పద్ధతులను అవలంభించి అధిక దిగుబడులు పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు జశ్వంత్ రెడ్డి, నిర్మల, మహంతేష్ శిరూర్, సుప్రియ, రైతులు పాల్గొన్నారు.



పల్లగిరి గ్రామ రైతులతో శాస్త్రవేత్తలు

అధ్వానంగా అండర్ పాస్‌లు

ఇబ్బందుల్లో వాహనచోదకులు

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, తిరుమలగిరి గ్రామాల్లో 65వ నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అండర్ పాస్‌లు అధ్వాన్నంగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా తిరుమలగిరి నుంచి తొర్రకుంటపాలెం వెళ్లే రహదారిలోని అండర్ పాస్ గోతులమయంగా మారింది. తిరుమలగిరి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు ఆయా గ్రామాలకు వెళ్లే ఈరోడ్డులోని అండర్‌పాస్ గుంతలమయమై అధ్వానంగా ఉంది. అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో వాహనదారులు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా షేర్‌మహ్మద్‌పేట నుంచి జగ్గయ్యపేట వెళ్లే రహదారిలోని అండర్ పాస్ కూడా అదే దుస్థితిలో ఉంది. కొద్దిపాటి వర్షానికే అండర్‌పాస్‌లో మూడు నుంచి నాలుగు అడుగుల మేర నిలిచిపోతుండటంతో రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకుండాపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని వాహనచోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



షేర్‌మహ్మద్‌పేట-గ్గయ్యపేట రోడ్డులోని అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

కలుషిత తాగునీటి సరఫరాపై నిరసన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విమర్శించారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద తాగునీటి కాలుష్యంపై బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పైపులైన్లు తుప్పు పట్టడం, మురుగు కాలువలో నీరు తాగునీటిలో కలవడం, ఆ నీటిని ప్రజలకు సరఫరా చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కలుషిత నీటిని తాగిన ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రస్తుతం ప్రజలు వైరల్ జ్వరాల బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. కృష్ణా నది ఒడ్డున ఉన్న గ్రామాలకు తాగునీరు అందించలేని కూటమి ప్రభుత్వం విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. సీపీఎం నాయకులు బాష, ఆలేటి విఠల్ రావు, వీటీపీఎస్ సీఐటీయూ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేసిన సీపీఎం నాయకులు

నేడు రాజ్యాంగ పరిరక్షణ కోరుతూ ధర్నా

మాజీ డీజీపీ, ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త జె.పూర్ణచంద్రరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం గురువారం నగరంలోని ధర్నా చౌక్‌లో భారీ ధర్నా నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజ్యాంగంలో నుంచి లౌకిక-సామ్యవాద అనే పదాలను తొలగించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం చూస్తోందని, అందువల్ల రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని నిర్వహించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. గతంలో వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇలాంటి ప్రయత్నం జరిగిందని, అప్పుడు కాన్షీరాం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం అలాంటి కుట్రలు చేస్తోందని, అందువల్ల ఇప్పుడు కాన్షీరాం స్ఫూర్తితో ఆయన వర్ధంతి రోజైన అక్టోబర్ 9 నుంచి రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

సీజేఐపై దాడి గర్హనీయం

కంచికచర్ల: సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేయడమంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనని బహుజన రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ బుధవారం ప్రకటనలో అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగమే అందరికీ రక్షణ అని, అటువంటి రాజ్యాంగ పరంగా ఎన్నికకాబడిన సీజేఐ గవాయ్‌పై న్యాయవాది బూట్ విసరడమంటే రాజ్యాంగాన్ని అవహేళన చేయడమేనన్నారు. మేధావులు ప్రజాస్వామిక వాదులు, న్యాయవాదులు ఈ ఘటనపై ఆలోచించాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


గ్రామాల అభివృద్ధే లక్ష్యం

నందిగామటౌన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని అనాసాగరం నుంచి హనుమంతపాలెం వరకు రూ.1.48 కోట్ల నాబార్డు నిధులతో చేపడుతున్న సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. ఈ రహదారుల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటనలో నిర్లక్ష్యం తగదు: ఎస్టీయూ

జి.కొండూరు: ప్రభుత్వం ఏర్పడి పదహారు నెలలు గడిచినా ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించడంలో నిర్లక్ష్యం వహించడం దారుణమని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. యూనియన్ నాయకులు శ్యామ్, అనంత్, శాంత్‌రాజు, కోట శ్యామ్ ప్రసాద్, ఆనంద్‌బాబు, మోహన్‌రెడ్డి, జోసఫ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవే లయన్స్ క్లబ్ ధ్యేయం



మైలవరం: సేవ చేయడమే లయనిజం ధ్యేయమని లయన్ జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో బుధవారం సేవా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. అనంతరం అన్నదాన చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పాస్ట్ జిల్లా గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. నూతనంగా ఇద్దరు లయన్స్ క్లబ్ సభ్యత్వం తీసుకున్నారు. చైల్డ్ ఐ కేర్ క్యాంపు జిల్లా కో–ఆర్డినేటర్ వై. శ్రీనివాసరావు ఉచితంగా 250 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ ఎన్‌వీఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



నందిగామరూరల్: ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాడుతున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 12,13 తేదీలలో కొండపల్లిలో జరిగే జిల్లా 12వ మహాసభల వాల్‌పోస్టర్‌ను స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక హక్కులు, సంక్షేమంతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల, దేశీయ పరిశ్రమల రక్షణ, స్వావలంబన కోసం ఐక్య పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు. కార్మికవర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను మార్చి కార్మికులను కట్టుబానిసలను చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 12నుంచి కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించే జిల్లా మహాసభల్లో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కటారపు గోపాల్, సుశీల, కొల్లి సరళ, తిరుమలదేవి, దాసవరపు సైదా, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి: సీఐ

కంచికచర్ల: ద్విచక్రవాహనం నడిపే సమయంలో ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ఏదేని ప్రమాదం చోటుచేసుకుంటే విలువైన ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసి పోతాయని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ చవాన్ దేవ్ హెచ్చరించారు. మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు బుధవారం హెల్మెట్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ, ద్విచక్రవాహనదారులు వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని రాంగ్‌రూట్‌లో వాహనాలను నడపరాదన్నారు, మద్యం తాగి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. హెల్మెట్ ధరిస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులంతా దేశానికి పట్టుకొమ్మల్లాంటి వారని, మంచి ప్రణాళికలతో విద్యనందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.విశ్వనాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చవాన్ దేవ్, పక్కన ఎస్ఐ పి.విశ్వనాథ్

పూర్తికావస్తున్న అతిథి గృహం పనులు



భక్తుల కోసం నిర్మించిన విశ్రాంతి మందిరం



నిర్మాణంలో ఉన్న అతిథిగృహం

- చిన్నం యోగయ్య కుటుంబసభ్యుల దాతృత్వం
- భక్తుల కోసం రూ.1.70కోట్లతో భవనాల నిర్మాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన భక్తులు తలపెట్టిన పెద్దహాలు, విశ్రాంతి గదుల నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. హైదరాబాద్, ఎల్బీనగర్‌కు చెందిన చిన్నం యోగయ్య జ్ఞాపకార్థం అతని కుమారుడు నరేష్, అల్లుడు శ్రీను కలిసి అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.1.20కోట్లతో ఇప్పటికే విశ్రాంతి మందిరాన్ని నిర్మించగా, ఈ భవనం ఏటా వేలాది మంది భక్తులకు ఆశ్రయమిస్తోంది.గతంలో అమ్మవారి ఆలయం వద్ద నిద్రించాలనుకునే భక్తులు ఆలయం ఆరుబయట చలికి ఇబ్బందిపడేవారు. అదేవిధంగా ఎటువంటి రక్షణ లేకుండా నిద్రించాల్సిన పరిస్థితి ఉండేది. ఈక్రమంలో దాతలు చిన్నం నరేష్, శ్రీను కలిసి విశ్రాంతి మందిరం భవనంపైన భక్తుల కోసం మరో రూ.50లక్షలతో పెద్దహాలుతో కూడిన అతిథిగృహం, మూడు గదుల నిర్మాణానికి పూనుకోగా, ఆ పనులు కూడా దాదాపు పూర్తికావచ్చాయి. భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి మందిరాన్ని నిర్మించిన యోగయ్య కుటుంబసభ్యులకు భక్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. అమ్మవారి దయతో అందరం బాగుండాలని, ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని యోగయ్య కుటుంబసభ్యులు తెలిపారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

జగ్గయ్యపేట అర్బన్: క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, నేటి యాంత్రిక జీవనంలో క్రీడలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయని ఎంఈవో ఎల్.చిట్టిబాబు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో నిర్వహించిన మండల స్థాయిలో క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఆయా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనగా, జిల్లా స్కూల్ గేమ్స్‌లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అండర్–14, 17 విభాగాల్లో మండలస్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 300 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ డివిజన్ కోఆర్డినేటర్ జి.వెంకటేశ్వర్లు, మండల కోఆర్డినేటర్ ఎం.నాగేశ్వరరావు, స్కూల్ హెచ్‌ఎం పీవీ.నాగేశ్వరరావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, జె.శారదకుమారి, ఎల్.సరోజ, బి.సునీత, ఆర్.ప్రభాకరరావు, లక్ష్మికుమారి, గురవయ్య పాల్గొన్నారు.



క్రీడల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో చిట్టిబాబు

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం

ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీమ్ ఎస్ఐ వీరాంజనేయులు

తిరువూరు: నేటితరం విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మత్తుపదార్థాల నిరోధక ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీమ్ ఎస్ఐ ఎం. వీరాంజనేయులు అన్నారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో 2025 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం నైతిక విలువలు, మత్తు పదార్థాల నిరోధం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం విద్యార్థులు మత్తు పదార్థాలకు ఆకర్షితులై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, వారికి విలువలతో కూడిన విద్య నందించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థులను తరగతి గదిలో నిరంతరం పరిశీలించే ఉపాధ్యాయులు వారిలో వచ్చే మార్పులను గమనించి తప్పుడు మార్గంలోకి వెళ్లకుండా దిశానిర్దేశం చేయగలిగే విధంగా వ్యవహరించాలని కోరారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కూడా ఉపాధ్యాయులే మార్గదర్శకులన్నారు. ఈగల్ టీమ్ అధికారి పి. రాంబాబు, శిక్షణా తరగతుల సమన్వయకర్తలు కేశవరావు, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ వీరాంజనేయులు

వైభవంగా సుదర్శన హోమం

విజయవాడ కల్చరల్: కంచికామకోటిపీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం లబ్బీపేటలో లోక కల్యాణార్థం బుధవారం రుత్వికులు సుదర్శన హోమం నిర్వహించారు. పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, తోమాల సేవలను వైభవంగా నిర్వహించారు. వేదపండితులు దినత్రయ చతుర్వేదాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. శుక్రవారం గణేష హోమం, ఆదివారం మహాసౌర అరుణ పారాయణ, 20వ తేదీన చండీహోమం, 26వ తేదీన రాహుకేతు పూజలు నిర్వహిస్తునట్లు తెలిపారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న రుత్వికులు